



# మన దునియా

Our News Our World

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

మన దునియా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాల్లో సంచలనాలు సృష్టిస్తున్న

మన దునియా

మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాలు, మండలాలు మరియు నియోజకవర్గాల వారిగా పనిచేయుటకు అవకాశం కల్పిస్తోంది.

రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 353 | ఆగస్టు 24 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-




# కొడంగల్ లో రైతులకు దిక్కెవరు సీఎం సార్?

## రెట్టింపు ధరలకు యూరియా.. డీఏపీ!











- ఎమ్మార్పీ ధరలకు ఎరువులు విక్రయించాల్సి ఉండగా అధిక వసూళ్ల ఆరోపణలు
- వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే వత్తాసు పలుకుతున్నారంటున్న రైతులు
- కొడంగల్‌లో ఎరువుల దందాపై రైతుల ఆవేదన.. "మా బాధ ఎవరికి చెప్పుకోవాలి?"
- సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో పరిస్థితిపై తీవ్ర చర్చ

## కోడంగల్‌లో ఎరువుల దందాపై రైతుల ఆవేదన.. "మా బాధ ఎవరికి చెప్పుకోవాలి?"

**మన దునియా/కొడంగల్,ఆగస్టు 23**

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరకడం ఒక సమస్య అయితే.. పంట సాగుకు అవసరమైన ఎరువులను సకాలంలో, ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేయడం మరో పెద్ద సమస్యగా మారిందని కొడంగల్ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో యూరియా, డీఏపీ తదితర ఎరువులకు డిమాండ్ పెరగడంతో కొందరు వ్యాపారులు ఇదే అదునుగా తీసుకుని ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రైతుల ఆరోపణల ప్రకారం.. కొన్ని ఎరువుల దుకాణాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ "స్టాక్ లేదు" అంటూ చెప్పడం, తమకు కావాల్సిన విధంగా కొనుగోలు చేస్తేనే ఎరువులు ఇస్తామని చెప్పడం, ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితిపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు

(మిగతా 7వ పేజీలో..)

## అమెరికా పర్యటన రద్దు.. అండగా నిలిచిన ఖర్గేకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు

- కేంద్రం అనుమతి నిరాకరించడంతో అమెరికా పర్యటన రద్దు
- లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన సీఎం
- ఈ అంశంలో మద్దతిచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ప్రత్యేక కృతజ్ఞతలు
- హైదరాబాద్ చేరుకున్నాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని ప్రకటన

తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం 'రాజకీయ కారణాలతో' అనుమతి నిరాకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ క్లిష్ట సమయంలో తనకు బలమైన మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. లండన్‌లో తాను

(మిగతా 2వ పేజీలో..)



## రేవంత్‌కు క్షమాపణ చెప్పాల్సిందే: కొండా సురేఖకు ఎమ్మెల్యేల అల్టిమేటం

- సీఎం రేవంత్‌పై మంత్రి సురేఖ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో దుమారం
- కూతురి మాటలతో తనకు సంబంధం లేదన్న మంత్రి కొండా సురేఖ
- సురేఖను కేబినెట్ నుంచి తొలగించాలని 20 మందికి పైగా ఎమ్మెల్యేల డిమాండ్
- సీఎంకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గట్టిగా పట్టుబట్టిన శాసనసభ్యులు

విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ



(మిగతా 2వ పేజీలో..)

## సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం: ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా

- నేటి అర్ధరాత్రి నుంచి తలపెట్టిన బంద్‌ను విరమించాలని ఆటో డ్రైవర్లకు మంత్రి పొన్నం విజ్ఞప్తి
- ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడి
- పాత ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోలు కొంటే ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తామన్న మంత్రి

ఇవాళ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు

(మిగతా 2వ పేజీలో..)



## రేవంత్ రెడ్డి.. ఇదేనా మీరు చెప్పే అంతర్జాతీయ ప్రమాణాలు

- దళారులపై ఉన్న ప్రేమ చేనేత కార్మికులపై ఏది?
- మాజీ మంత్రి హరీశ్ రావు

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 23**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫారాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు అందజేసిన స్కూల్ యూనిఫారాలు అప్పుడే చినిగిపోవడం, మరి కొన్ని చోట్ల సరైన కొలతలు లేకుండా అందజేయడం పట్ల హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే మీరు.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా?

(మిగతా 2వ పేజీలో..)





మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## రేవంత్ రెడ్డి.. ఇదేనా మీరు చెప్పే అంతర్జాతీయ ప్రమాణాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇదేనా మీరు చెప్పే అంతర్జాతీయ ప్రమాణాలు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు.

దళారులపై ఉన్న ప్రేమ చేనేత కార్మికులపై ఏది?:

రాష్ట్రంలో ఒకచోట యూనిఫారాలు అందలేదు.. అందినచోట కొలతలు సరిగ్గా లేవు. కుట్లు ఊడిపోతున్నాయి.. ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయి. రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ.. తెలంగాణ చేనేత కార్మికులపై లేదని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి.. కమీషన్ల కోసం బడా కార్పొరేట్ల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేశారని విమర్శించారు.

విచారణ జరిపించండి:

"మఫత్‌లాల్ ముద్దు.. చేనేత వద్దు" అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? అని హరీశ్ రావు నిలదీశారు. ఒకవైపు చేనేత కార్మికుల ఉపాధికి గండి.. మరోవైపు విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు.. దీంతో విద్యార్థులకు కష్టం.. చేనేత కార్మికులకు ఉపాధి నష్టం అన్నారు. నాసీరకం యూనిఫామ్?లపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## రేవంత్‌కు క్షమాపణ చెప్పాల్సిందే: కొండా సురేఖకు ఎమ్మెల్యేల అల్టిమేటం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదం మరింత ముదిరింది. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, ఆమె సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని 20 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులతో సీఎంపై విమర్శలు చేయించడం సంస్కార హీనమని, కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడం కేవలం బుకాయింపు మాత్రమేనని వారు విమర్శించారు.ఇటీవల గీసుకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డితో పాటు పార్టీ నాయకత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి సురేఖ వివరణ ఇస్తూ, తన కూతురి వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి రాజకీయంగా తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తనపై జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.అయితే, సురేఖ వివరణపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం వేదికగా సమావేశమై, సురేఖపై మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడటం సరికాదని, సురేఖ వెంటనే తన కుమార్తె వ్యాఖ్యలను ఖండించి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని డిమాండ్ చేశారు. సీనియర్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా స్పందించారు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ నిబంధనలను అతిక్రమించాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి కూడా సుస్మిత వ్యాఖ్యలు అనుచితమని, మంత్రిగా ఉన్న సురేఖ వాటిని ఖండించకపోవడం తప్పని అన్నారు. శనివారం సమావేశమైన క్రమశిక్షణ కమిటీ.. సురేఖ వివరణ, వీడియో ఫుటేజీలను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

## ప్రభుత్వంతో చర్చలు సఫలం.. తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ

తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మె విరమించుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని 'కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ' పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి యూనియన్ల నేతలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన యూనియన్ల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించారు.ప్రధానంగా ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ముఖ్యంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలిపినట్టు సమాచారం. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యూనియన్ల నేతలు, సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రితో చర్చలు సఫలం కావడంతో, యథావిధిగా ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలు రోడ్డెక్కనున్నాయి. దీంతో ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పినట్టయింది.

## సమ్మె వద్దు.. సమస్యలు పరిష్కరిస్తాం: ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మంత్రి పొన్నం భరోసా

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మెల ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలతోనే సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారు చర్చలకు సహకరించాలని కోరారు. హుస్నాబాద్‌లో పర్యటించిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.ఆటో కార్మికుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన ఛార్జీల సవరణపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఆటో ఛార్జీలు పెరగలేదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఛార్జీల పెంపుపై అధ్యయనం చేసేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీలో రవాణా శాఖ అధికారులతో పాటు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులకు కూడా స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.అంతేకాకుండా, ఆటో కార్మికుల కోసం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కేబినెట్ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ బోర్డు కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా మార్గదర్శకాలను త్వరలోనే ఖరారు చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎంత సీరియస్‌గా తీసుకుని పరిష్కరించామో, అదే రీతిలో ఆటో కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆటో డ్రైవర్ల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. అలాగే, పాత వాహనాలను గ్రీన్ ఎనర్జీలోకి మార్చుకునేందుకు (రెట్రోఫిట్టింగ్) త్వరలోనే ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ బంద్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రభుత్వంతో చర్చలకు ముందుకు రావాలని పొన్నం ప్రభాకర్ మరోసారి కోరారు.

## అమెరికా పర్యటన రద్దు.. అండగా నిలిచిన ఖర్గేకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాల్సిన అధికారిక సమావేశాలు, కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినందున, తొలుత అనుకున్న ప్రకారం బోస్టన్‌కు వెళ్లకుండానే తన పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. "గడిచిన మూడు రోజులుగా లండన్‌లో నాకు లభించిన మద్దతుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ అంశంలో నాకు మద్దతుగా నిలిచిన పార్టీకి, నాయకులకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ధన్యవాదాలు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత సంబంధిత అన్ని విషయాలపై మాట్లాడతాను" అని రేవంత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

కేంద్రం తీరుపై మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం

అంతకుముందు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాలకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రులు చేసే పర్యటనలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. కేంద్రం పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపించారు."కేంద్రానికి నచ్చిన వారికి అనుమతులు ఇవ్వడం, ఇతరులకు నిరాకరించడం సరైంది కాదు. అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్నారైలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిని కలిసి తమ రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టాలని, పెట్టుబడులు తీసుకురావాలని ముఖ్యమంత్రులు ఆహ్వానిస్తారు. ఈ పర్యటనల ద్వారా వచ్చే పెట్టుబడులు కేవలం రాష్ట్రానికే కాక, దేశానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అలాంటి కీలకమైన పర్యటనను అడ్డుకోవడం ద్వారా కేంద్రం దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది" అని ఖర్గే వ్యాఖ్యానించారు. లండన్ నుంచి రేవంత్ రెడ్డి నేరుగా హైదరాబాద్‌కు రానుండటంతో, ఆయన తిరిగి వచ్చాక ఈ వివాదంపై ఏ విధంగా స్పందిస్తారనేది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ ఘటన కాంగ్రెస్, బీజేపీ మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

**గచ్చిబౌలి ఆంజనేయ నగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత**

**నిన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం**

**సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్**

**ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు**

**అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు**

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి.శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి.ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.



# కామన్‌పల్లి పీహెచ్‌సీకి మోక్షమెప్పుడు?





**నత్తనడకన భవన నిర్మాణ పనులు.. వర్షాకాలంలో వైద్యం కోసం జన్నారం బాట**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,ఆగస్టు 23**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కామన్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా భవనం ఇంకా పూర్తికాకపోవడంతో గ్రామ ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రాలేదు.ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉండటంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలో ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి అనారోగ్యానికి కూడా జన్నారం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు అరకొరగా సాగడంపై అధికారులు, కాంట్రాక్టర్ తీరుపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని కోరుతున్నారు.నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి పీహెచ్‌సీని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు అవసరమైన వైద్య సదుపాయాలను గ్రామంలో వెంటనే కల్పించాలని కామన్‌పల్లి గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


# ఎమ్మెల్యే ఆదేశించినా కదలని అధికార యంత్రాంగం

**కామన్‌పల్లిలో 30 ఎకరాల ప్రభుత్వ భూమిపై ఆక్రమణల ఆరోపణలు**

**20 రోజులు గడిచినా ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయలేదంటున్న సర్పంచ్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ,ఆగస్టు 23:**

జన్నారం: ప్రజాప్రతినిధి స్వయంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత శాఖల్లో చలనం కనిపించడం లేదని కామన్‌పల్లి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానిక సర్పంచ్ పేరం శ్రీనివాస్ ఆరోపించారు.మండలంలోని కామన్‌పల్లి గ్రామంలో నీటిపారుదల శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి వినియోగిస్తున్నారని సర్పంచ్ తెలిపారు. ఈ నెల 4న ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు.సర్పంచ్ ఫిర్యాదుపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సమావేశంలోనే సంబంధిత నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారికి వెంటనే నోటీసులు జారీ చేసి, ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.అయితే ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసి 20 రోజులు గడిచినా ఇప్పటివరకు ఆక్రమణదారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని సర్పంచ్ ఆరోపించారు. ప్రజాప్రతినిధుల ఆదేశాలకే అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం




చేస్తున్నారు.ఇదిలా ఉండగా అధికారులు స్పందించకపోవడంపై గ్రామంలో పలు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణదారులకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు.ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు వెంటనే స్పందించి కామన్‌పల్లిలోని నీటిపారుదల శాఖ భూములను సర్వే చేసి, అక్రమ ఆక్రమణలు ఉన్నట్లయితే తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# మహిళ శరీర భాగాలతో బిర్యానీ..

**వెన్నులో వణుకు పుట్టించే క్రైమ్..**

**ఈ దంపతులు చేసిన కిరాతకం తెలిస్తే..**

**మన దునియా,తమిళనాడు:ఆగస్టు 23**

తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో సూట్‌కేస్‌లో శరీర భాగాలు దొరికిన కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఒడిశాకు చెందిన ఒక మహిళను చెన్నైలో కిరాతకంగా చంపి, శరీర భాగాలను సూట్‌కేస్‌లో పెట్టి రైలులో వదిలేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘోరం ఆగస్టు 5న జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ బోగీలో ఉన్న ఒక ఎరుపు రంగు సూట్‌కేస్ నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దాన్ని తెరిచి చూడగా నరికిన మానవ శరీర భాగాలు కనిపించాయి. ఆ సూట్‌కేస్‌ను చెన్నై సెంట్రల్ స్టేషన్‌లోనే రైలు ఎక్కించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. కేసు ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగి చెన్నై సెంట్రల్ స్టేషన్ చుట్టుపక్కల దాదాపు 350 సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఒక మహిళ, ఒక పురుషుడు కలిసి ఎరుపు రంగు సూట్‌కేస్‌తో స్టేషన్‌లోకి వచ్చి రైలులో పెట్టినట్లు రికార్డయింది. ఆ తర్వాత వారు చెన్నై పార్క్ స్టేషన్ నుంచి లోకల్ రైలు ఎక్కి గూడువాంచేరికి వెళ్లినట్లు గుర్తించారు.

**పోలీసులే షాక్..**

గూడువాంచేరి పరిసరాల్లోని సీసీటీవీల ఆధారంగా వారు ఎక్కిన ఆటోను పోలీసులు కనిపెట్టారు. ఆ ఆటో వెళ్లిన మార్గాన్ని బట్టి మసీదు వీధిలోని వారి అద్దె ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మరకలు, హత్య జరిగినట్లు బలమైన ఆధారాలు దొరికాయి. హత్య తర్వాత ఆనవాళ్లు లేకుండా చేసేందుకు నిందితులు చేసిన పనులు పోలీసులనే షాక్ అయ్యేలా చేశాయి. మృతదేహాన్ని ముక్కలుగా కోసి, ఎముకలను వేరు చేసి కొన్ని భాగాలను సూట్‌కేస్‌లో కుక్కారు. మిగిలిన శరీర భాగాలను మైదా పిండి, కూరగాయలతో కలిపి పెద్ద బిర్యానీ పాత్రలో పెట్టి ఉడికించినట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి తల కోసం గాలింపు కొనసాగుతుంది.మృతురాలిని ఒడిశాకు చెందిన హయత్ నిషాగా గుర్తించారు. ఆమె భర్తతో విడిపోయింది. ఆమె తాంబరంలోని ఒక ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తుండగా, ఆమె కుమారుడు ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే నిషా మాణిక్ ఉత్తిన్ -- లస్కర్ దంపతులతో కలిసి ఉంటున్నట్లు తెలుస్తోంది. మాణిక్ ఉత్తిన్ తనకు తమ్ముడు అవుతాడని నిషా చుట్టుపక్కల వారికి చెప్పినట్లు సమాచారం. భార్యభర్తలు ఈ దారుణానికి ఎందుకు ఒడిగట్టారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డబ్బు, నగల కోసమే ఈ హత్య జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.







## కంటి శస్త్రచికిత్స అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగన్న గౌడ్ ను పరామర్శించిన నాయకులు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 23:**



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్ ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సీనియర్ నాయకులు అజ్మీర హరి నాయక్ ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా లింగన్న గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అజ్మీర హరి నాయక్ మాట్లాడుతూ.. లింగన్న గౌడ్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, సామాజిక కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ఆయన త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్, దేవునిగూడ ఉప సర్పంచ్ కల్లెం శ్రీనివాస్ రెడ్డి, పీసీఆర్ ఫౌండేషన్ సభ్యులు ఉత్తూరు శ్రీనివాస్ తదితరులు కూడా గాజుల లింగన్న గౌడ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## ఆంక్షలతో అభివృద్ధి కుంటుపడుతోంది.. టైగర్ జోన్‌ను ఎత్తివేయాలి

**జన్నారంలో సామాజికవేత్త భూమాచారి రిలే నిరాహార దీక్ష**


**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 23:**




కవ్వాల్ టైగర్ జోన్, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనల కారణంగా జన్నారం ప్రాంతంలో అభివృద్ధి పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆరోపిస్తూ సామాజిక పోరాట సమితి నాయకుడు, సామాజికవేత్త భూమాచారి రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ.. టైగర్ జోన్, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా ఇసుక లభ్యతపై ఆంక్షల కారణంగా ఇళ్ల నిర్మాణాలు, ఇతర భవన నిర్మాణ పనులు మందగించడంతో నిర్మాణ రంగంపై ఆధారపడిన కూలీలు, మేస్త్రీలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సామాన్య ప్రజలు సొంత ఇళ్ల నిర్మాణం చేపట్టలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలు, జీవనోపాధి, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని టైగర్ జోన్, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలను పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.కవ్వాల్ టైగర్ జోన్‌ను రద్దు చేసేలా రాష్ట్ర అసెంబ్లీలో తక్షణమే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని భూమాచారి స్పష్టం చేశారు.ఈ దీక్షకు స్థానిక ప్రజలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

## విద్యుత్ షాక్‌తో స్తంభం నుంచి కిందపడిన జూనియర్ లైన్మెన్.. తీవ్ర గాయాలు

**మన దునియా,దండేపల్లి; ఆగస్టు 23:**



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని మోకాసిగూడ స్టేజ్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై జూనియర్ లైన్మెన్ మహేందర్ విద్యుత్ స్తంభం నుంచి కిందపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. విధుల్లో భాగంగా విద్యుత్ స్తంభంపై పని చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో అదుపుతప్పి కిందపడినట్లు స్థానికులు తెలిపారు.ఈ ప్రమాదంలో మహేందర్‌కు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.విద్యుత్ స్తంభాలపై విధులు నిర్వహించే సిబ్బంది భద్రతా ప్రమాణాలను పాటించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై విద్యుత్ అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. మహేందర్ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# వెల్‌జర్లలో వానరుల బెడద

- రోజూ గాయాలు, రాత్రింబవళ్లు భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- ఇప్పటివరకు పదుల సంఖ్యలో గాయాలు కాగా నేడు ఆదివారం మరొకరికి తీవ్ర గాయం
- కోతుల బెడద నుండి తమని రక్షించాలంటూ డిమాండ్

**మన దునియా,ఫరూఖ్ నగర్,వెల్‌జర్ల:ఆగస్టు 23**



గ్రామంలో ప్రశాంతంగా ఉండాల్సిన రోజువారీ జీవితం ఇప్పుడు భయంతో నిండిపోయింది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు జనావాసాల్లోకి చొరబడి ఆహారం ఎత్తుకెళ్లడమే కాకుండా...అడ్డొచ్చిన వారిపై దాడులు చేస్తూ గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఫరూఖ్ నగర్ మండలం వెల్ జర్లలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ఇళ్లలోకి ప్రవేశించి పండ్లు, కూరగాయలు, ఆహార పదార్థాలను తీసుకెళ్లడం సాధారణమైపోయింది. అడ్డొచ్చిన వారిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో గ్రామస్తులు కోతుల దాడుల్లో గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు . తాజాగా ఆదివారం సాయంత్రం మరో వ్యక్తి పై కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనతో గ్రామంలో భయాందోళన పెరిగింది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కూడా దాడుల భయంతో అప్రమత్తంగా సంచరించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ భయంతోనే బయటకు వెళు _న్నాం. ఎప్పుడు దాడి జరుగుతుందో తెలియదని గ్రామస్తులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. గ్రామస్తులు ఇప్పుడు కేవలం కోతుల భయంతోనే కాదు, అధికారుల నిర్లక్ష్యంతో కూడా బాధపడుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకపోతే గ్రామంలో భయాందోళనలు మరింత పెరుగుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఇంతవరకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ పరిసరాల్లో ఆహారం, చెట్ల కొరత కారణంగానే కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని వారు అంటున్నారు.ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని, మరిన్ని దాడులు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గచ్చిబౌలి బిల్డింగ్ కూలిన ఘటన.. బిల్డర్, కాంట్రాక్టర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు

**మన దునియా,గచ్చిబౌలి:ఆగస్టు 23**




గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో నిన్న (శనివారం) ఏడంతస్తుల భవనం కూలి మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు టైల్స్ కార్మికులు మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారిస్తున్నారు. ఈ ప్రమాదంపై రాయదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సాజిద్‌పై 105 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పోలీసుల అదుపులో నిందితుడు సాజిద్ ఉన్నాడు. అతి తక్కువ స్థలంలో, నాలాను ఆనుకుని ఏడంతస్తుల అక్రమ నిర్మాణం చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. గతంలో అధికారులు సీజ్ చేసినా.. నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ పనులు చేస్తున్నట్లుగా గుర్తించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బిల్డర్, కాంట్రాక్టర్లపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. అంజయ్య నగర్‌లోని ఇతర అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులు నివేదిక కోరారు. అనుమతులు లేని భవనాలపై కఠిన చర్యలు ఉంటాయని హైడ్రా అధికారులు హెచ్చరించారు..

## ముత్యాలమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్న చిన్న గొల్లగూడెం గ్రామ ప్రజలు

**మన దునియా ,వాజేడు ,ఆగస్ట్ 23**

వాజేడు మండల కేంద్రంలో పేరూరు గ్రామపంచాయతీ పరిధిలో చిన్న గొల్లగూడెం గ్రామంలో ఆదివారం ఘనంగా ముత్యాలమ్మ బోనాలు గ్రామ స్తులు కలిసి జరుపుకున్నారు ఈ సందర్భంగా డప్పు దరువులతో బయలుదేరి హనుమాన్ ముత్యాలమ్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు కొబ్బరికాయలు పూలు పండ్లు తీర్థప్రసాదాలు నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు సకాలంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని జిల్లా పేపర్లతో ఆయురారోగ్యాలతో ఉండాలని మెక్కులు చెల్లించుకున్నారు



# ప్రతి ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నివాళులర్పించడం ఆదర్శనీయం






**ఘనంగా ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమం**

**విద్యాభివృద్ధితోనే సమాజంలో సముచిత గౌరవం: సీనియర్ అడ్వకేట్ బెత్తపు లక్ష్మణ్**

**మన దునియా,జగిత్యాల జిల్లా:ఆగస్టు 23**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సీనియర్ అడ్వకేట్ బెత్తపు లక్ష్మణ్ పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ బెత్తపు లక్ష్మణ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే ఆత్మగౌరవం, సామాజిక పురోగతి సాధ్యమవుతాయని సీనియర్ న్యాయవాది, మాజీ ఎంపీపీ, బెత్తపు లక్ష్మణ్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని, సిద్ధాంతాలను సమాజంలోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబేద్కర్ వారసులుగా జీవించడం మనందరి అదృష్టమని, ఆయన చూపిన బాటలో నడుస్తూ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**విగ్రహ సాధన జ్ఞాపకాలు:**

1993 కాలంలో జగిత్యాలలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం కలపెల్లి రామ్ లక్ష్మణ్, బొల్లం విజయ్ కుమార్, కొప్పుల వెంకటరమణ, నక్కల లక్ష్మీనారాయణ, మల్యాళ ప్రతాప్ తదితర సీనియర్లు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. వారి నిరంతర శ్రమ ఫలితంగానే 2004 మార్చిలో విగ్రహ ఆవిష్కరణ సాధ్యమైందని తెలిపారు. అంబేద్కర్ కీర్తి ప్రతిష్టలు నిరంతరం వర్ధిల్లేలా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డిక్కీ జిల్లా కో–ఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం ఈ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు విద్య, చైతన్యం, సామాజిక ఐక్యత అవసరమని, యువత ఆయన బాటలో నడిచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మట్టిపూలు పత్రిక సంపాదకులు తక్కళ్ళ దేవయ్య,తెలంగాణ శక్తి ఎడిటర్ ఆనంతుల కాంతారావు,అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,బిట్ల నర్సయ్య,భోగ ఓంప్రకాష్,న్యాయవాదులు, చిత్తారి మల్లయ్య, నకుమల్ల లక్ష్మీనారాయణ,మద్దెల సంపత్,మాల మహానాడు అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్తభాకర్, దళిత క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముద్దమళ్ళ ఆనంద్ ప్రవీణ్ కుమార్, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు కడమండ కమలాకర్, జిల్లా కోశాధికారి గిద్దె శంకర్, పట్టణ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కంటె అంజయ్య,అప్పం స్వామి,బొల్లం ప్రభాకర్,తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరిమల్ల చిట్టిబాబు, కండ్లే లక్ష్మణ్,బాసమల్ల చంద్రశేఖర్, బొట్ల విజయ్ రతన్, సంకె మహేష్, దాసండ్ల కమలాకర్, రుద్ర మనోహర్,ఇంద్రాల రవి, అసాది హరీష్,బిట్ల ప్రకాష్, కండ్లే రాకేష్ శివరాత్రి శ్రీమివాస్,మైల రాజు,నీరటి రాజ్ కుమార్,జిల్లా దళిత సంఘాల సీనియర్ నాయకులు దుమాల గంగాధర్,తదితర అంబేద్కర్ వాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రశ్నే ప్రజాస్వామ్యానికి పునాది...

**ప్రశ్న జ్ఞాన సముపార్జనకు మూలం...**

తరగతి గదిలో విద్యార్థి వేసే ప్రశ్న నుంచి ప్రజాస్వామ్య సౌధాన్ని నిలబెట్టే ప్రశ్న వరకు దాని ప్రాధాన్యం ఎంతో ఉంది. ప్రశ్నించడం ద్వారా తప్పులను గుర్తించగలం, కొత్త ఆలోచనలకు అవకాశం కలుగుతుంది. కానీ ప్రశ్నించేవాడిని శత్రువుగా చూసే ధోరణి పెరిగితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. చట్టసభల్లో ప్రశ్నోత్తరాల సమయం అందుకే ఎంతో ముఖ్యమైనది. ప్రజల తరఫున సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, సమస్యలపై సమాధానాలు రాబట్టడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. ప్రశ్నించే అవకాశం లేకపోతే అధికారపక్షం తన సంఖ్యాబలంతో నిర్ణయాలను బుల్డోజ్ చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం అవసరం. ప్రశ్న పాలకులను ఇబ్బంది పెడుతున్నప్పుడు వారు సభలకు, సమావేశాలకు, విలేకరుల సమావేశాలకు దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. దేశ ప్రధానమంత్రి కొన్నేళ్లుగా విలేకరుల సమావేశాలకు దూరంగా ఉంటున్నారనే విమర్శ ఉంది. నార్వే పర్యటనలో విలేకరి ప్రశ్నలు అడగబోతున్న సమయంలో ప్రధాని అక్కడి నుంచి వెళ్లిపోయారనే విమర్శలు కూడా వచ్చాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో మొదటి రోజు హాజరై తరువాత సమావేశాలకు దూరంగా ఉండటం కూడా ప్రశ్నలకు భయపడుతున్నారనే విమర్శలకు కారణమైంది.జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. విద్యార్థులపై పెల్లెట్ గన్స్, మేకులతో కూడిన లాఠీలతో దాడి చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఎవరి ఆదేశాలతో ఈ చర్యలు జరిగాయనే ప్రశ్న పార్లమెంటులో కూడా చర్చకు వచ్చింది. ప్రధాని, హోంమంత్రి సభకు హాజరు కాకపోవడంతో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి కిరణ్ రిజిజు సభ్యులను సమాధానపరచడానికి ప్రయత్నించడం కూడా గమనార్హంగా మారింది. ముఖ్యమైన బిల్లులు సభలో ఆమోదం పొందాల్సి ఉన్న సమయంలో కీలక మంత్రులు సభకు దూరంగా ఉండటం వల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని బిల్లులపై సమగ్ర చర్చ జరగలేదనే విమర్శలు వచ్చాయి. విదేశీ నిధుల నియంత్రణ బిల్లును పార్లమెంటరీ కమిటీకి అప్పగించడం కూడా జరిగింది. సాధారణంగా సంఖ్యా బలంతో బిల్లులను ఆమోదించుకునే అధికారపక్షం, బయట జరుగుతున్న ప్రజా నిరసనల కారణంగా కొంత వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి సమస్యలపై యువత దేశ రాజధానిలో నిరసనలు వ్యక్తం చేయడం కూడా ప్రశ్నించే స్వభావానికి ప్రతీక. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత ఉండాలని యువత కోరుతోంది.ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యుడైన మంత్రి ముందే రాజీనామా చేసినా, సమస్యపై యువత ప్రశ్నలు కొనసాగాయి. వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా వారిపై ముద్రలు వేయడం సమస్యను పరిష్కరించదు. ఇదే సందర్భంలో ప్రధాని మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని ప్రస్తావించడం చర్చకు దారితీసింది. సమాజంలో జరిగే అన్యా యాన్ని, అవినీతిని, అక్రమాలను ప్రశ్నించే వారిని ఉద్దేశించేలా ఈ పదాన్ని ఉపయోగించడంపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రతి ఆలోచనాపరుడినీ ఇలాంటి ముద్రతో చూడటం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు అనుకూలమనే ప్రశ్న తలెత్తింది. గతంలో 'అర్బన్ నక్సల్స్' అనే పదాన్ని ఉపయో గించినట్లే ఇప్పుడు ప్రశ్నించే ప్రతి ఆలోచనా పరుడినీ 'దిమాగీ నక్సల్'గా ముద్ర వేయడం ప్రమాదకరమైన ధోరణి. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత తమ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారి సమస్యలను వినాలి.ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ అనుమానంతో చూడటం ప్రారంభిస్తే చివరకు ప్రశ్నించే హక్కే ప్రమాదంలో పడుతుంది. నేటి యువత సోషల్ మీడియాలో చాలా చురుకుగా ఉంది. తమ అసంతృప్తిని కొత్త రకాలుగా వ్యక్తం చేస్తోంది. 'దిమాగీ నక్సలైట్' అనే పదానికి నిరసనగా ఆన్‌లైన్‌లో కొత్త రాజకీయ వేదిక ఏర్పడటం, దానికి పెద్ద సంఖ్యలో అనుచరులు రావడం కూడా యువతలోని స్పందనకు ఒక ఉదాహరణ. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారని ఈ పరిణామాలు గుర్తుచేస్తున్నాయి.

ఇంత పెద్ద దేశంలో భావ సంఘర్షణ సహజం. తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ప్రభుత్వాలను ప్రశ్నించడం, విధానాలను విమర్శించడం ప్రజాస్వామ్యంలో భాగమే. ప్రజలు న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం కోరుతున్నప్పుడు వారి డిమాండ్లను పరిశీలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నిరసనలకు కారణమైన సమస్యలను పరిష్కరించకుండా నిరసనకారులపైనే ముద్రలు వేయడం వల్ల అసంతృప్తి మరింత పెరిగే అవ కాశం ఉంది. ప్రశ్నే ప్రజాస్వామ్య సౌధానికి పునాది. ప్రశ్నించే హక్కును కాపాడటం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# పోచారం శ్రీనివాస్ రెడ్డి పోచారం దారెటు.. క్యాడర్‌లో గందరగోళం..

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో గందరగోళం నెలకొంది. పార్టీలో నేతలు ఎవరికి వారే అన్నట్టుగా కొనసాగుతున్నారన్న చర్చ సాగుతోంది.**

**పోచారం శ్రీనివాస్ రెడ్డి హాట్ టాపిక్‌గా పోచారం..**

**పీఏసీ ముందు ధర్నా.. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహం**

**బాన్సువాడ రాజకీయం రసవత్తరంగా మారింది.**

**పోచారంనకు చెక్ పెట్టేలా స్కెచ్..?**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



కామారెడ్డి: ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో గందరగోళం నెలకొంది. పార్టీలో నేతలు ఎవరికి వారే అన్నట్టుగా కొనసాగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రెండు జిల్లాల పరిధిలో ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి.

పోచారం శ్రీనివాస్ రెడ్డి హాట్ టాపిక్‌గా పోచారం..

ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి అంశం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. కొద్దిరోజులుగా బాన్సువాడ నియోజకవర్గంలో చిత్రవిచిత్రమైన రాజకీయాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోకి ఏనుగు రవీందర్ రెడ్డి ఎంట్రీ తర్వాత ఇక్కడి రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయని చెప్పడంలో అతిశయోక్తి ఏమి లేదన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఏకంగా పోచారంను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పీఏసీ కమిటీ ముందు ధర్నా చేపట్టడం చర్చనీయాంశంగా మారగా అధిష్టానం నిర్ణయం ఎలా ఉంటుందోనన్న చర్చ సాగుతోంది.

పోచారం శ్రీనివాస్ రెడ్డిలిరసవత్తరంగా బాన్సువాడ రాజకీయం..

బాన్సువాడ రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. మాజీ స్పీకర్, బాన్సువాడలో తిరుగులేని నేతగా పేరు తెచ్చుకున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే కాదు, రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్?గా మారింది. అటు బీఆర్ఎస్ కాదు, ఇటు కాంగ్రెస్ కాదు అన్నట్టుగా ఆయన రాజకీయ ప్రస్థానం త్రిశంకులో పడింది. దాంతో అసలు బాన్సువాడలో ఏం జరుగుతోందన్న చర్చ సాగుతోంది. ఒకప్పుడు బాన్సువాడకు పెద్ద దిక్కుగా ఉన్న పోచారం ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితిలో ఉండడం కార్యకర్తలను కూడా అయోమయంలోకి నెడుతోంది.

పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వంపై పొగడ్తలు.. నిధులపై విమర్శలు

పోచారం తీరు క్యాడర్?ను తీవ్ర గందరగోళంలోకి నెడుతోంది. ఒకవైపు ప్రభుత్వం నుంచి తన నియోజకవర్గానికి నిధులు రావడం లేదని బహిరంగ వేదికలపై ఆరోపిస్తున్నారు. సీఎం చెప్పినా మంత్రులు స్పందించడం లేదని, ఫలితంగా పనులు నిలిచిపోతున్నాయని బహిరంగంగానే చెబుతున్నారు. మరోవైపు అదే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని కితాబిస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు హోదాలో ఉండి ప్రభుత్వాన్ని విమర్శించడం ఏమిటనే ప్రశ్న క్యాడర్?లో వ్యక్తమవుతోంది. ఈ ద్వంద్వ వైఖరి వెనుక ఆంతర్యం ఏమిటనేది ఎవరికీ అర్థం కావడం లేదు. ఇది ఒత్తిడి పెంచే వ్యూహమా లేక అసంతృప్తికి సంకేతమా అనే చర్చ జరుగుతోంది. సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తూ, అదే ప్రభుత్వ పథకాలను పొగడటం వెనుక రాజకీయ వ్యూహం ఉందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

పార్టీపై కన్ఫ్యూజన్..

అసలు కన్ఫ్యూజన్ అంతా కండువా దగ్గరే మొదలైందన్న చర్చ సాగుతోంది. తాను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని, కప్పుకున్నది జాతీయ జెండా కండువా అని పోచారం పలుమార్లు చెబుతూ వస్తున్నారు. తాను కాంగ్రెస్?లో చేరలేదని చెబుతున్నారే తప్ప, తాను బీఆర్ఎస్?లోనే కొనసాగుతున్నానని మాత్రం ఎక్కడా చెప్పడం లేదు. దీంతో ఆయన అసలు ఏ పార్టీలో ఉన్నట్టు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటు బీఆర్ఎస్ కాకుండా, ఇటు కాంగ్రెస్ కాకుండా మధ్యలో ఉండడం వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని విశ్లేషకులు అంటున్నారు.

పార్టీలో ఉంటేనే పదవి..

రాజకీయంగా ఇది తెలివైన స్టెప్?గా కొందరు భావిస్తుంటే, ఇది నమ్మకద్రోహం అని మరికొందరు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో లేనప్పుడు ప్రభుత్వ సలహాదారు పదవిలో ఎందుకు కొనసాగుతున్నారనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సలహాదారులుగా పార్టీకి చెందిన వారికే అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్?లో లేని వ్యక్తికి ప్రభుత్వ పదవి ఎలా ఇస్తారని, ఇది పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం కాదా అనే ప్రశ్నలను ఏనుగు వర్గీయులు లేవనెత్తుతున్నారు.

పీఏసీ ముందు ధర్నా..

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇటీవల నిజామాబాద్? నగరంలోని పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ పీఏసీ మీటింగ్ ముందు ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు ధర్నాకు దిగడం కలకలం రేపింది. పోచారం వల్ల బాన్సువాడలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వెంటనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పీఏసీ ముందే ధర్నా చేయడం ద్వారా అధిష్టానానికి తమ నిరసనను తెలియజేయాలని వారు భావించినట్లు తెలుస్తోంది.

పోచారంనకు చెక్ పెట్టేలా స్కెచ్..?

ఈ మొత్తం వ్యవహారంలో ఏనుగు రవీందర్ రెడ్డి తెరవెనుక రాజకీయం చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బాన్సువాడలో తన రాజకీయ భవిష్యత్తుకు పోచారమే అడ్డుగా ఉన్నారని ఏనుగు భావిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. పోచారం రాజకీయ జీవితానికి పూర్తిగా చెక్ పెట్టేలా ఏనుగు ప్లాన్ చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీఏసీ ముందు ధర్నా చేయించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. బాన్సువాడలో పట్టు కోసం ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ నడుస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఏనుగు రాజకీయంగా ఎదగడానికి పోచారం అడ్డు తొలగాలని ఆ వర్గం భావిస్తున్నట్టు చెబుతున్నారు.

ఎటూ తేల్చుకోలేని పార్టీ అధిష్టానం

పోచారంపై సస్పెన్షన్ వేటు వేసే అవకాశం లేదనే చర్చ పొలిటికల్ వర్గాల్లో సాగుతోంది. ఆయన అధికారికంగా కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని చెప్పడమే ఇందుకు నిదర్శనంగా చూపిస్తున్నారు. సస్పెండ్ చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని, అందుకే అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోందని తెలుస్తోంది. మరోవైపు పోచారం తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతుండగా, ఆయన రాకను బీఆర్ఎస్?లో కూడా వ్యతిరేకిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. బీఆర్ఎస్?లో ఉన్నప్పుడే ఆయన వల్ల నష్టపోయామని ఆ పార్టీ నేతలు అంటున్నట్టు సమాచారం. దీంతో పోచారం పరిస్థితి తేల్చుకోలేకుండా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

క్యాడర్‌లో గందరగోళం..

అధిష్టానం డైలమాలో ఉండడం, ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరుతో బాన్సువాడ క్యాడర్?లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎవరిని నమ్మాలో, ఎటు వెళ్లాలో తెలియక స్థానిక నాయకులు, కార్యకర్తలు సతమతమవుతున్నారు. పోచారం వెంట ఉండాలా, ఏనుగు వెంట నడవాలా అనే అయోమయంలో పడ్డారు. పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో, ఈ త్రిశంకు పరిస్థితికి ఎప్పుడు తెరపడుతుందోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి అయితే బాన్సువాడ రాజకీయం రసవత్తరంగా మారింది.

# సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- **ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలి తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషనరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ డిమైండ్**

**మన దునియా, వాజేడు ,ఆగస్టు 23**

హైదరాబాద్ ఎల్బి స్టేజియంలో చేపట్టిన జన జాగరణ యాత్ర కు వాజేడు మండలం ఉపాధ్యాయులు బయలుదేరు మండల అధ్యక్షులు కోరిక స్వరూప్ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు బాలాజీ మ మెనీ ఫేస్టులో పెట్టిన విధాంగ సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు సిపిఎస్ విధానంలో రిటైర్డ్ అయినటువంటి ఉపాధ్యాయుల పడుతున్న ఇబ్బందులను గుర్తు చేశారు రిటైర్డ్ అయినటువంటి ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పెన్షన్ కన్నా తక్కువ మొత్తంలో పెన్షన్ తీసుకుంటున్నా రు కుటుంబ ఖర్చులకు సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంప్ లాయ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ వాజేడు మండల ఉపాధ్యక్షులు, రాజేష్ నాగార్జున ,శ్రీకాంత్ ,కోశాధికారి రాజేష్, ఇమ్రాన్, ప్రసాద్ ,రాజు చంద్రమౌలి అశోక్, ప్రశాంత్, నజీమ్ ,మై బిల్లీ, తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నరు




# భూపాలపల్లి జిల్లా ఇసుక క్వారీల ఆగడాలకు హద్దే లేదా?

- **ప్రభుత్వమే లోడింగ్ చార్జీలు చెల్లిస్తుంటే.. ఒక్కో లారీకి రూ.5 వేల వసూళ్లు ఎందుకు?**
- **మౌనమేలా..మంత్రి గారు.?**

**మన దునియా,భూపాలపల్లి:ఆగస్టు 22**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక క్వారీల నిర్వహణపై మరోసారి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక కోసం క్వారీలకు వచ్చే లారీల నుంచి నిబంధనలకు విరుద్ధంగా భారీ మొత్తంలో లోడింగ్ చార్జీల పేరుతో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వమే లోడింగ్‌కు సంబంధించిన చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ.. క్వారీ యజమానులు ఒక్కో లారీ నుంచి అదనంగా రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి.

**ప్రభుత్వ చెల్లింపులు ఉన్నా.. లారీలపై అదనపు భారం?**

ఇసుక క్వారీల వద్దకు ఇసుక తరలించేందుకు వచ్చే లారీలకు నిబంధనల ప్రకారం లోడింగ్ ప్రక్రియ జరగాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన చార్జీలను ప్రభుత్వమే భరిస్తున్న పరిస్థితిలో.. లారీ యజమానులు లేదా డ్రైవర్ల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అయితే భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ఇసుక క్వారీల వద్ద మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. 'లోడింగ్ చార్జీ' పేరుతో ఒక్కో లారీకి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని వారు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే డీజిల్, డ్రైవర్ ఖర్చులు, ఇతర రవాణా వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న లారీ యజమానులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రశ్నిస్తే బెదిరింపులు.. దాడులకు దిగుతున్నారనే ఆరోపణలు**

అక్రమంగా డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించిన లారీ డ్రైవర్లపై క్వారీ నిర్వాహకులు, వారి అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అంతేకాదు.. క్వారీల వద్ద జరుగుతున్న వ్యవహారాలను ప్రశ్నించేందుకు వెళ్లే మీడియా ప్రతినిధులతో కూడా కొందరు క్వారీ నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం దిగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరమా?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూళ్లు జరుగుతున్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా? అనే విషయాలను సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**టీజీఎండిసి అధికారులు ఏం చేస్తున్నారు?**

ఇసుక క్వారీల నిర్వహణను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.ప్రభుత్వమే లోడింగ్ చార్జీలు చెల్లిస్తుంటే.. లారీల నుంచి మళ్లీ అదనంగా రూ.5 వేల వరకు ఎందుకు వసూలు చేస్తున్నారన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. నిజంగా నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నాయా? జరిగితే వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.అధికారుల పర్యవేక్షణలోనే ఇసుక క్వారీలు నడుస్తున్నప్పుడు.. అక్కడ జరుగుతున్న వ్యవహారాలు అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**ప్రజాప్రతినిధుల మౌనం ఎందుకు?**

జిల్లాలో ఇసుక క్వారీల వద్ద ఇలాంటి ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ.. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.లారీ డ్రైవర్లు, యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని వారు కోరుతున్నారు. క్వారీల వద్ద అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**విచారణ జరిపితే అసలు నిజం బయటపడుతుందా?**

ఇసుక క్వారీల వద్ద ఒక్కో లారీ నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.క్వారీకి వచ్చే ప్రతి లారీ వివరాలు, లోడింగ్‌కు సంబంధించిన చెల్లింపులు, రసీదులు, అధికారిక రేట్లు, క్వారీ నిర్వాహకుల ఖాతాల్లోకి వెళ్తున్న మొత్తాలు వంటి అంశాలను అధికారులు పరిశీలిస్తే.. అదనపు వసూళ్లు జరుగుతున్నాయా లేదా అన్నది స్పష్టమవుతుంది.

**అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలి**

ఇసుక ప్రజల అవసరాలకు సంబంధించిన సహజ వనరు. ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా పారదర్శకమైన విధానం ఉండాలి. కానీ ప్రభుత్వ నిబంధనల పేరుతో క్వారీల వద్ద అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే.. అది ప్రభుత్వ విధానాలకే సవాలుగా మారుతుంది.అందుకే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఇసుక క్వారీలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, లోడింగ్ చార్జీల పేరుతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు తేల్చాలి. అక్రమ వసూళ్లు నిజమని నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లారీ యజమానులు, డ్రైవర్లు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక క్వారీల వద్ద ఏం జరుగుతోంది?

ప్రభుత్వం చెల్లించే లోడింగ్ చార్జీలను మళ్లీ లారీల నుంచి ఎందుకు వసూలు చేస్తున్నారు? అధికారులకు ఈ వ్యవహారం కనిపించడం లేదా? ప్రజాప్రతినిధులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు, క్వారీ నిర్వాహకులు సమాధానం చెప్పాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## సీఎం పర్యటన అడ్డుకోవడం అంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే: ఎమ్మెల్యే డా.. భూపతి రెడ్డి



**తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణకు 12 ఏళ్లవుతుంది**

**ఇప్పటికీ అమలు కానీ విభజన హామీలు**

**బీజేపీ రాజకీయ దురుద్దేశ్యంతో వ్యవహరిస్తుంది**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



నిజామాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను బీజేపీ ప్రభుత్వం రాజకీయ కుట్రతో అడ్డుకుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి ఆరోపించారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సుదర్శన్ రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణను లి'2047 రైజింగ్ తెలంగాణ'లిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని భూపతి రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. ఈ లక్ష్య సాధనలో ఉన్నత విద్య, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఉపాధి కల్పన, పరిశ్రమలు--పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించడం వంటి అంశాలు కీలకమని చెప్పారు. అంతర్జాతీయ పర్యటనల ద్వారా వివిధ దేశాల్లోని పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, విద్యా సంస్థలు, ప్రవాస తెలంగాణ ప్రజలతో సంప్రదింపులు జరిపి రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి, విద్యా అవకాశాలను తీసుకురావడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాంటి పర్యటనలను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధి వేగాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు."సీఎం పర్యటనను అడ్డుకోవడం అంటే ముమ్మాటికీ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే" అని భూపతి రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి పేరు వస్తుందనే భయంతోనే బీజేపీ రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చి 12 ఏళు పూర్తవుతున్నప్పటికీ, విభజన చట్టంలోని అనేక హామీలు, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని ఎమ్మెల్యే అన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, మౌలిక వసతుల అభివృద్ధి, ఔటర్ రింగ్ రోడ్ తదితర అంశాల్లో తెలంగాణకు కేంద్రం నుంచి తగిన సహకారం అందడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధి ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రధానమని భూపతి రెడ్డి అన్నారు. '2047 రైజింగ్ తెలంగాణ' లక్ష్యాన్ని సాధించేందుకు పెట్టుబడులు, పరిశ్రమలు, విద్య, ఉపాధి, మౌలిక వసతుల రంగాల్లో వేగంగా ముందుకు సాగుతామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులు సృష్టించే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, తెలంగాణ ప్రయోజనాల కోసం అవసరమైన ప్రతి వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అంతర్జాతీయ పర్యటనలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం రాజకీయ దురుద్దేశ్యమే అన్నారు.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎత్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.

# నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ









**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లా నిరుద్యోగ యువతీయువకులకు పోలీస్ శాఖ తరపున కానిస్టేబుల్?, ఎస్సైల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిజామాబాద్? సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ పోలీస్ శాఖ తరపున కానిస్టేబుల్?, ఎస్సైల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరంలో యువతకు నిర్వహించిన స్క్రీనింగ్? టెస్ట్? కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు.

**మూడు డివిజన్లలో..**

ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆదివారం కమిషనరేట్? పరిధిలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మూడు డివిజన్లలో ఈ పరీక్ష జరిగిందన్నారు. నిజామాబాద్ డివిజన్‌కు సంబంధించి విజయ్? రూరల్ ఇంజినీరింగ్ కాలేజీలో, ఆర్మూర్ డివిజన్‌కు క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజీలో, బోధన్ డివిజన్‌కు జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీలో పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు.

**అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా..**


పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. పరీక్షా ప్రక్రియ సజావుగా , పారదర్శకంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించారని వివరించారు. స్క్రీనింగ్? టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను ఎంపిక చేసి , వారికి పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై నియామక పరీక్షలకు అవసరమైన రాత పరీక్ష, ఫిజికల్ ఈవెంట్స్, తదితర అంశాల్లో సమగ్ర శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు. స్క్రీనింగ్? టెస్ట్ నిర్వహణలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీటీసీ, ట్రాఫిక్, సీసీఎస్ , ఏఆర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలకు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్?హెచ్?వోలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (ఘ్రాఖీ) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (ఘ్రాఖీ) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి.ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# కొడంగల్ లో రైతులకు దిక్కెవరు సీఎం సార్?

(మొదటి పేజీ తరువాయి)

కఠినంగా స్పందించి తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని రైతులు మండిపడుతున్నారు.

**ఎమ్మార్పీ ధరలకు విక్రయించాల్సిందే.. మరి అమలు ఎక్కడ?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువుల విక్రయాల్లో నిర్ణయించిన ధరలను పాటించాల్సి ఉంటుంది. రైతులకు బిల్లులు ఇవ్వడం, స్టాక్ వివరాలు, ధరల పట్టికలు, నిల్వలు తదితర అంశాలను సంబంధిత అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే కొడంగల్ ప్రాంతంలో కొన్ని దుకాణాలపై అధిక ధరల వసూళ్ల ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. "ఎరువుల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నాం. ఒకవైపు సమయానికి ఎరువులు దొరకడం లేదు. మరోవైపు దొరికినా అడిగిన ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ఎందుకు చెల్లించాలి?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.రూ.200 నుంచి రూ.500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలుకొడంగల్ పట్టణంలోని కొన్ని ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ ధరల కంటే రూ.200 నుంచి రూ.500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సీజన్ సమయంలో రైతులకు అత్యవసరంగా ఎరువులు అవసరం కావడంతో ఇదే పరిస్థితిని కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. "పంటను కాపాడుకోవాలంటే ఎరువు తప్పనిసరి. దుకాణదారుడు చెప్పిన ధరకు కొనకపోతే ఎరువు ఇవ్వరు. ఎక్కడైనా దొరుకుతుందేమోనని తిరిగితే సమయం వృథా అవుతుంది. చివరకు పంట దెబ్బతింటుందనే భయంతో ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది" అని పలువురు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**"స్టాక్ లేదు.. ఎక్కడ ఉంటే అక్కడ తెచ్చుకో" అంటూ సమాధానం?**

కొడంగల్ మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు తనకు ఎదురైన అనుభవాన్ని వెల్లడించినట్లు సమాచారం. కొడంగల్ పట్టణంలోని వైష్ణవి ఏజెన్సీ ఎరువుల దుకాణంలో గతంలో వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, మందులు కొనుగోలు చేస్తూ వచ్చానని, అయితే ప్రస్తుత సీజన్‌లో ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బులు అడిగారని ఆయన ఆరోపించారు.ఈ విషయంపై దుకాణదారుని ప్రశ్నించగా "మా దగ్గర స్టాక్ లేదు.. ఎక్కడ ఉంటే అక్కడ తెచ్చుకో.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అన్నట్టుగా సమాధానం వచ్చిందని రైతు పేర్కొన్నాడు. ఈ సంభాషణను తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత దుకాణ యాజమాన్యం, వ్యవసాయ శాఖ అధికారుల పూర్తి వివరణ వెలువడాల్సి ఉంది.

రైతుల ఆరోపణలకు అధికారుల స్పందన ఏమిటి?

రైతుల ఆరోపణలు నిజమైతే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. అయితే కొందరు అధికారులు వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను రైతులు తీవ్రంగా చేస్తున్నారు."వ్యాపారులపై ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోవడం లేదు. మేము రైతులం.. అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగే స్థోమత లేదు. మా మాట వినేవారు లేకపోతే ఎవరిని ఆశ్రయించాలి?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారులకు అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, అవి వాస్తవమా కాదా అన్నది అధికారిక విచారణ ద్వారా తేలాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రుద్రారంలో నకిలీ ఎరువుల ఆరోపణల కలకలం

ఇదిలా ఉండగా.. కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో గతంలో కొన్ని ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు విక్రయిస్తున్నారంటూ రైతులు బ్యానర్లు ఏర్పాటు చేసి ఆందోళన వ్యక్తం చేశారని స్థానికులు చెబుతున్నారు.రైతులు స్వయంగా ఇలాంటి ఆరోపణలు చేయడం ఆ ప్రాంతంలో కలకలం రేపినప్పటికీ, దీనిపై సంబంధిత శాఖ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు."మా పంటలకు నకిలీ ఎరువులు వాడితే నష్టం మాకే. పంట పోతే మా కుటుంబం మొత్తం రోడ్డున పడుతుంది. అందుకే అధికారులు దుకాణాలను తనిఖీ చేసి నాణ్యమైన ఎరువులే విక్రయిస్తున్నారా లేదా స్పష్టం చేయాలి" అని రైతులు కోరుతున్నారు."మాకు మామూళ్లు కాదు.. న్యాయం కావాలి" అంటున్న రైతులుకొడంగల్ ప్రాంతంలో ఎరువుల విక్రయాలపై వస్తున్న ఆరోపణలు కేవలం అధిక ధరలకే పరిమితం కాకుండా.. అధికారులు, వ్యాపారుల మధ్య సంబంధాలపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యేలా చేస్తున్నాయని రైతులు అంటున్నారు.అయితే అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలను నిర్ధారించే అధికారిక ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది. అందువల్ల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలని రైతులు కోరుతున్నారు."మాకు ఎవరి మీద వ్యక్తిగత కక్ష లేదు. మా చెమటకు విలువ రావాలి. మా డబ్బుకు తగ్గ ఎరువు రావాలి. ఎమ్మార్పీ ధరల కంటే ఒక్క రూపాయి ఎక్కువ ఎందుకు ఇవ్వాలి? అధికారులు మా పక్షాన నిలబడాలి" అని రైతులు వేడుకుంటున్నారు.

**సీఎం సార్.. మీ సొంత నియోజకవర్గంలో రైతుల గోడు వినిపించదా?**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది."సీఎం సార్.. మీరు రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. కానీ మీ సొంత నియోజకవర్గంలోనే ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మేము ఎవరిని ఆశ్రయించాలి? మా బాధ ఎవరికి చెప్పాలి?" అంటూ కొడంగల్ రైతులు కన్నీటితో ప్రశ్నిస్తున్నారు.రైతులకు న్యాయం చేయాలని, ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్లు--బిల్లులు--ధరల పట్టికలను పరిశీలించాలని, ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు ముఖ్యమంత్రిని కోరుతున్నారు.

వైష్ణవి ఏజెన్సీపై చర్యలు ఉంటాయా? లేక క్లీన్‌చిట్ ఇస్తారా?అధిక ధరల వసూళ్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న వైష్ణవి ఏజెన్సీపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.రైతుల ఆరోపణలపై అధికారికంగా విచారణ జరుగుతుందా?దుకాణంలోని స్టాక్, అమ్మకాల రికార్డులు పరిశీలిస్తారా?ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేశారో లేదో తేలుస్తారా?రైతులకు బిల్లులు ఇచ్చారా లేదా పరిశీలిస్తారా?అధికారులపై వచ్చిన ఆరోపణలపైనా విచారణ జరుగుతుందా?అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

"రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోయినట్టే"

రైతు పంట సాగు కోసం అప్పు చేసి ఎరువులు కొనుగోలు చేస్తాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరుగుతున్న సమయంలో ఎమ్మార్పీ కంటే అధికంగా ఎరువులు కొనాల్సి వస్తే రైతుపై అదనపు ఆర్థిక భారం పడుతుంది.అందుకే ఎరువుల దుకాణాల్లో ధరలపై కఠిన నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు.. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కూడా ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతుల చివరి ప్రశ్న.. "మాకు దిక్కెవరు సీఎం సార్?"

"పంట పండించేది మేమే..

పన్నులు చెల్లించేది మేమే..

అన్నం పెట్టేది మేమే..

అయితే ఎరువు కొనేటప్పుడు మా మాట వినేవారు ఎవరూ లేరా?"

అంటూ కొడంగల్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."మమ్మల్ని దోచుకునే వారిని కాపాడకండి. తప్పు చేసిన వారు వ్యాపారులైనా.. అధికారులు అయినా చర్యలు తీసుకోండి. మా కష్టం మీద వ్యాపారం చేసే వారికి అడ్డుకట్ట వేయండి. మాకు న్యాయం చేయండి" అంటూ రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక చూడాల్సింది ఒక్కటే.. రైతుల ఆరోపణలపై ప్రభుత్వం స్పందిస్తుందా? ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తుందా? ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై నిజానిజాలు వెలుగులోకి తీసుకొస్తుందా? అధికారుల పాత్రపై కూడా విచారణ చేపడుతుందా? రైతుల కన్నీటికి సమాధానం దొరుకుతుందా.. లేక ఎరువుల దందా యథావిధిగా కొనసాగుతుందా.. వేచి చూడాల్సిందే.





## ఇంగ్లండ్ పేస్ బౌలర్ కు బేడీలు వేసి తీసుకెళ్లిన పోలీసులు



పాకిస్థాన్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ జట్టులో కలకలం రేగింది. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్ బ్రైడన్ కార్స్‌ను పోలీసులు బేడీలతో అదుపులోకి తీసుకున్న ఘటన కొంచెం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం (ఆగస్టు 22) రాత్రి డెర్బీలోని ఓ నైట్‌క్లబ్ వెలుపల ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనిపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విచారణకు ఆదేశించింది.వివరాల్లోకి వెళితే.. డెర్బీలోని 'మోలీ మలోన్స్ ఐరిష్ టావెర్న్' అనే నైట్‌క్లబ్ వెలుపల నలుగురు పోలీసులు కార్స్‌ను చుట్టుముట్టి చేతులకు బేడీలు వేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే సమయంలో తోటి ఇంగ్లండ్ ఆటగాడు మాథ్యూ పాట్స్ అతడితో మాట్లాడుతుండగా, ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా ఆ వీడియోలో కనిపించడం గమనార్హం. అయితే పోలీసులు కార్స్‌ను అరెస్ట్ చేయలేదని, కొద్దిసేపటికే విచారించి ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండా విడుదల చేశారని తెలిసింది.క్లబ్ నుంచి బయటకు వచ్చి తిరిగి లోపలికి వెళ్లే క్రమంలో బౌన్సర్లతో వివాదం జరగడమే ఈ గొడవకు కారణమని సమాచారం. పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో కార్స్ జట్టులో ఉన్నప్పటికీ తుది జట్టులో అవకాశం దక్కలేదు. దీంతో అతడిని కౌంటీ క్రికెట్ ఆడేందుకు ఈసీబీ అనుమతించింది. దర్హామ్ తరఫున ఆడిన మ్యాచ్‌లో కార్స్ రెండు వికెట్లు తీశాడు. ఈ ఘటనపై ఈసీబీ స్పందిస్తూ, "డెర్బీలో జరిగిన సంఘటన మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరుపుతున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం" అని తెలిపింది. ఆగస్టు 27 నుంచి లార్డ్స్‌లో ప్రారంభం కానున్న రెండో టెస్టుకు ప్రకటించిన ఇంగ్లండ్ జట్టులో కార్స్ సభ్యుడిగా ఉన్నాడు. గతంలో బెట్టింగ్ సంబంధిత కార్యకలాపాల కారణంగా కార్స్ మూడు నెలల నిషేధాన్ని ఎదుర్కొన్నాడు.

## జట్టు మారతాడన్న ప్రచారానికి చెక్.. గోవాకే ఫిక్స్ అయిన సచిన్ తనయుడు

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు, యువ పేసర్ అర్జున్ టెండూల్కర్ తన దేశవాళీ క్రికెట్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాడు. రాబోయే దేశవాళీ సీజన్‌లో కూడా అతను గోవా జట్టుకే ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల గోవా జట్టు ఒమన్‌లో పర్యటించగా, అర్జున్ ఆ టూర్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో అతను గోవా జట్టును వీడి మరో జట్టుకు మారతాడంటూ ప్రచారం జరిగింది.అయితే, ఈ వార్తల్లో నిజం లేదని, అర్జున్ గోవాతోనే కొనసాగుతాడని అసోసియేషన్ వర్గాలు స్పష్టం చేసినట్లు స్పోర్ట్స్‌స్టార్ తన కథనంలో పేర్కొంది. 2022–23 సీజన్‌కు ముందు మెరుగైన అవకాశాల కోసం ముంబై నుంచి గోవాకు మారిన 26 ఏళ్ల అర్జున్, అప్పటి నుంచి జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు.ఈ ఎడమచేతి వాటం పేసర్ గోవా తరఫున ఫస్ట్–క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు 50 వికెట్లు పడగొట్టాడు. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ తన నైపుణ్యాలను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. రంజీ ట్రోఫీలో రాజస్థాన్‌పై సెంచరీ సాధించి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు. దీంతో అన్ని ఫార్మాట్లలోనూ గోవా జట్టుకు అతను ముఖ్యమైన ఆటగాడిగా మారాడు. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ లక్నో సూపర్ జెయింట్స్ (రూ+) జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన సీజన్ చివరి మ్యాచ్‌లో అరంగేట్రం చేసి, 36 పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. ఈ మ్యాచ్ అనంతరం సచిన్ టెండూల్కర్ తన కుమారుడి సహనాన్ని, కష్టపడే తత్వాన్ని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అవకాశం కోసం ఓపికగా ఎదురుచూసి, దాన్ని సద్వినియోగం చేసుకున్నావంటూ కొనియాడాడు. అంతకుముందు అర్జున్ ముంబై ఇండియన్స్ జట్టులో కూడా సభ్యుడిగా ఉన్నాడు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ఇకపై ఓన్లీ బ్లాక్‌బస్టర్లే.. సినిమా నిర్మాణంపై బండ్ల గణేశ్ కీలక ప్రకటన!



ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ మరోసారి పూర్తిస్థాయిలో చిత్ర నిర్మాణంపై దృష్టి సారించాడు. ఇకపై తన ప్రయాణం కేవలం సినిమాలతోనే ఉంటుందని, బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించడమే తన ఏకైక లక్ష్యమని ఆయన స్పష్టం చేశాడు. మరే ఇతర అంశాలతోనూ తనకు సంబంధం లేదని పేర్కొంటూ శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశాడు."ఇక నా దృష్టి, నా నిర్ణయం, నా ప్రయాణం అంతా సినిమా నిర్మాణంపైనే. ప్రస్తుతం నాకు మరే ఇతర విషయాలతోనూ సంబంధం లేదు. కేవలం బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించాలనే గట్టి సంకల్పంతోనే ముందుకు సాగుతున్నాను. నా శ్రమ, సమయం, శక్తి అంతా ఇక సినిమాకే అంకితం" అని బండ్ల గణేశ్ తన పోస్టులో వెల్లడించాడు. మంచి సినిమాలు నిర్మించి, అఖండ విజయాలను అందుకోవడమే తన తదుపరి లక్ష్యమని ఆయన నొక్కిచెప్పాడు. గతంలో బండ్ల గణేశ్ తన 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పవన్ కల్యాణ్‌తో 'గబ్బర్ సింగ్', ఎన్టీఆర్‌తో 'బాద్‌షా', 'టెంపర్' వంటి భారీ విజయాలను అందుకున్నాడు. కొంతకాలంగా రాజకీయ పరమైన వ్యాఖ్యలతో నిరంతరం వార్తల్లో నిలుస్తున్న ఆయన, ఇటీవలే 'బీజీ బ్లాక్‌బస్టర్స్' (బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్) పేరుతో నూతన నిర్మాణ సంస్థను ప్రారంభించాడు.

## రూమర్స్‌పై గోవిందా సీరియస్.. రూ.100 కోట్ల దావా హెచ్చరిక!

బాలీవుడ్ నటుడు, మాజీ ఎంపీ గోవిందా తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించాడు. తన పెళ్లికి సంబంధించి తప్పుడు, నిరాధారమైన సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిస్తూ పబ్లిక్ నోటీసు జారీ చేశాడు. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, మీడియా సంస్థలు, కంటెంట్ క్రియేటర్లు ఎవరైనా తన గురించి లేదా తన కుటుంబం గురించి కల్పిత, ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచురించవద్దని ఈ నోటీసులో స్పష్టం చేశాడు.గోవిందా భార్య సునీతా అహుజా, నటి రాఖీ సావంత్‌తో జరిపిన సంభాషణ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయిన మరుసటి రోజే ఈ నోటీసు వెలువడటం గమనార్హం. నటి రాణి స్వర్ణకర్‌ను గోవిందా పెళ్లి చేసుకోవాలనుకోవడంతోనే తాను విడాకుల పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నానని ఆ సంభాషణలో సునీత చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే గోవిందా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడు.ఫొటోలు, వీడియోలు, మార్ఫింగ్ చిత్రాలు, డీప్‌ఫేక్‌లు, ఏఐ టెక్నాలజీతో తన అనుమతి లేకుండా వాయిస్, ఇమేజ్, గుర్తింపును వాడుకోవడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని నోటీసులో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత 2023, ఐటీ చట్టం 2000 ప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.దోషులుగా తేలిన వారి నుంచి రూ.100 కోట్ల వరకు నష్టపరిహారం క్లెయిమ్ చేయడంతో పాటు, వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం, ఆస్తుల లావాదేవీలపై ఆంక్షలు, పాస్‌పోర్టుల జప్తు వంటి చర్యల కోసం కూడా కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించాడు. తన పబ్లిక్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు వ్యవస్థీకృతంగా పుకార్లు వ్యాపింపజేస్తున్నారని గోవిందా ఆందోళన వ్యక్తం చేశాడు.



## ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి రేపు అక్షయ్ ఖన్నా 'యుద్ధరావం'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి మరో భారీ చిత్రాన్ని ప్రకటించడం తెలిసిందే. 'మహాకాళి' అనే శక్తివంతమైన టైటిల్‌తో రాబోతున్న ఈ లేడీ సూపర్ హీరో చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా రాక్షస గురువు శుక్రాచార్యుడి పాత్ర పోషిస్తున్నారు. 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరిట దీనికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను రేపు (ఆగస్టు 24) ఉదయం 11:34 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది.'హనుమాన్' చిత్రంతో ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌కు అద్భుతమైన పునాది పడింది. ఇప్పుడు అదే యూనివర్స్‌లో భాగంగా వస్తున్న ఈ 'మహాకాళి' చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. "మీరు ఇప్పటివరకు వినని సరికొత్త ప్రపంచాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ చిత్ర బృందం ఇచ్చిన క్యాప్షన్, సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో కన్నడ భామ భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తోంది. పూజా అపర్ణ కొల్లూరు 'మహాకాళి' చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఆర్‌కేడీ స్టూడియోస్, ఎస్ఓఆర్‌కేడీ స్టూడియోస్ పతాకాలపై నిర్మిస్తున్నారు.ఈ సినిమా తారాగణం చూస్తే దీని స్థాయి ఏంటో స్పష్టమవుతోంది. అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియారెడ్డి, సముద్రఖని, నాజర్, రోహిత్ సురేష్ సరాఫ్, మురళీ శర్మ, రజత్ కపూర్, జితిన్ గులాటి వంటి వివిధ పరిశ్రమలకు చెందిన ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ భారీ తారాగణం సినిమాను పాన్ ఇండియా స్థాయిలో మరో మెట్టు ఎక్కించనుంది.సాంకేతికంగా కూడా ఈ చిత్రాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ సినిమాను ఐమ్యాక్స్ 3డీ, డాల్బీ సినిమా వంటి అధునాతన ఫార్మాట్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రానికి డిజిటల్ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సురేష్ రగుతు సినిమాటోగ్రఫీ, శ్రీనాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్షన్ అందిస్తున్నారు. 'హనుమాన్' తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ 'మహాకాళి' రౌద్రం ఎలా ఉండబోతుందోనని సినీ ప్రియులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.






## 13 ఏళ్ల కెరీర్ పై రాశీ ఖన్నా ఏమన్నారంటే...!

ప్రముఖ నటి రాశీ ఖన్నా భారత చిత్ర పరిశ్రమలో తన 13 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. 2013లో 'మద్రాస్ కేఫ్' చిత్రంతో నటిగా అరంగేట్రం చేసిన ఆమె, అప్పటి నుంచి సమయం చాలా వేగంగా గడిచిపోయిందని అన్నారు. పనిని ఎల్లప్పుడూ ఒక అదృష్టంగా భావించడం వల్లే తనకు అలా అనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల '120 బహదూర్' చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించిన రాశీ, తన కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ ప్రయాణం గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ, "పదమూడేళ్ల సుదీర్ఘ సమయం. కానీ, పనిని ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను కాబట్టి సమయం తెలియలేదు. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే, నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నేను చెప్పాలనుకున్న కథలకు ఆ సినిమా అవకాశం ఇచ్చింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని తెలిపారు. 'మద్రాస్ కేఫ్' తర్వాత ఆమె కెరీర్ వేగం పుంజుకుంది.తొలి సినిమా నుంచే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాశీ ఖన్నా, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో విజయవంతంగా రాణిస్తున్నారు. విభిన్న భాషల్లో నటించడం కేవలం యాదృచ్ఛికం కాదని, స్పష్టమైన ప్రణాళికతోనే బహుభాషా నటిగా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు పొందారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాశీ ఖన్నా పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫర్జీ' వెబ్ సిరీస్ రెండవ సీజన్‌లో ఆమె నటిస్తున్నారు. షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో ఆమె ఆర్‌బీఐ అధికారిణి మేఘా వ్యాస్ పాత్రను మరోసారి పోషించనున్నారు. దీనితో పాటు, సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా రాబోతున్న తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'ధర్మన్'లోనూ, బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ హీరోగా అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న కామెడీ డ్రామాలోనూ ఆమె హీరోయిన్‌గా కనిపించనున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com